వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

ఆశవర్కర్లకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలి

వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా

వికారాబాద్, జనవరి 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆశవర్కర్లకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టరేట్ వరకు ఆశ వర్కర్లు పాదయాత్ర చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు రూ.18వేల వేతనం ఇచ్చేలా తీర్మానం చేయాలని, ఉద్యోగోన్నతి, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2024 ఫిబ్రవరి 9న, జూలై 30న, డిసెంబర్ 10న ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు ధర్నా చేయగా, చర్చల సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ రూ.60 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని, మట్టి ఖర్చులు రూ.50 వేలు ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు ఇస్తామని, టార్గెట్స్ రద్దు చేస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఇతర సమస్యలపైన ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియజేశారని వివరించారు. అనంతరం కలెక్టరేట్ లోని కార్యాలయ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు అమృత, ఉమాదేవి, లలిత, అరుణ, యాదమ్మ, సునీత, సుజాత, అంజమ్మ, అపురూప, శ్రీదేవి, సరిత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

మన్నెగూడ నుండిచి బొంగుళూరు వరకు పాదయాత్ర చేస్తున్న ఆశ వర్కర్లు

కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

రంగారెడ్డి జిల్లా ఆశ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు జీ కవిత

మన్నెగూడ నుంచి బొంగుళూరు వరకు మహాపాదయాత్ర

ఆదిబట్ల, జనవరి 21 : ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జీ కవిత డిమాండ్ చేశారు. మంగళవారం 300 మంది ఆశ వర్కర్లు జిల్లా ఆశ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో మన్నెగూడ చౌరస్తా నుంచి బొంగుళూరు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశ వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సునీత, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డీ కిషన్, జిల్లా కమిటీ సభ్యులు బుట్టి బాలరాజ్, పోచమోని కృష్ణ, జే పెంటయ్య, మండల సత్యనారాయణ, ఎన్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే.. పోలీసు బెదిరింపు !

ఉపాధి హామీ డబ్బులు రాలేదని

సెక్రటరీని నిలదీసిన ముడిమ్యాల్ గ్రామస్తులు

మధ్యలో కలుగజేసుకున్న చేవెళ్ల ఎస్ఐ సంతోశ్‌రెడ్డి

తీసుకెళ్లి లోపలేయాలని సిబ్బందికి ఆదేశం

అది వీడియో తీసిన జర్నలిస్టు ఫోన్ గుంజుకునేందుకు యత్నం

చేవెళ్ల రూరల్, జనవరి 21 : చేవెళ్ల మండలం ముడిమ్యాల్ గ్రామంలో ప్రత్యేక అధికారి, ఎంఈవో పురందాస్, పంచాయతీ కార్యదర్శి షమీమ్ సుల్తానా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో గందరగోళం చోటుచేసుకున్నది. గ్రామస్తులు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. ప్రతి జాబితా తప్పుల తడకగా ఉండడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గ్రామానికి చెందిన యంజాల మల్లేశ్ తాము ఇటీవల ఉపాధి హామీ కింద గ్రామ నర్సరీలో పనులు చేశామని, ఆ డబ్బులు ఇంకా రాలేవని పంచాయతీ కార్యదర్శిని నిలదీశాడు. తాము డబ్బులు వేశామని, బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకొస్తే పరిశీలన చేసి, ఒక వేళ డబ్బులు రాని క్రమంలో తిరిగి వేస్తామని కార్యదర్శి సమాధానమిచ్చారు. ఇదివరకే బ్యాంక్ స్టేట్‌మెంట్లు ఇచ్చానని, అయినా డబ్బులు రాలేదని చెప్పాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మధ్యలో చేవెళ్ల ఎస్ఐ సంతోష్ రెడ్డి కలుగజేసుకొని ప్రశ్నిస్తున్న మల్లేశ్‌ను తీసుకెళ్లి లోపల వేసి సాయంత్రం వదిలిపెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఘటనకు సంబంధించి వీడియో తీస్తున్న ఓ జర్నలిస్టు ఫోన్ గుంజుకునేందుకు ఎస్ఐ యత్నించాడు. దీంతో గ్రామస్తులందరూ నిలదీయడంతో వెనక్కి తగ్గాడు. స్థానిక నేతలు కలుగజేసుకొని శాంతింపజేశారు. గ్రామానికి చెందిన మహ్మద్ ఖాజా మొయినుద్దీన్ సైతం గ్రామంలోని చాలా వార్డుల్లో వీధి లైట్లు వెలగడం లేదని, పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నదని పంచాయతీ కార్యదర్శిని అడగడంతో ఎస్ఐ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎక్కువ మాట్లాడుతున్నవ్.. ప్రివెంటివ్ యాక్షన్ (ముందస్తు చర్య) తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

గ్రామ సభ మధ్యలో కలుగజేసుకొని మాట్లాడుతున్న చేవెళ్ల ఎస్ఐ సంతోశ్‌రెడ్డి

నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I హైదరాబాద్, బుధవారం 22 జనవరి 2025 RANGAREDDY

ఎన్నిసార్లు దండాలు పెట్టాలి..

రేషన్ కార్డు కావాలని అధికారులకు ఎన్నిసార్లు దండాలు పెట్టాలి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే రేషన్ కార్డు మంజూరు కాలేదు. రేషన్ కార్డు ఉన్నవారికే మళ్లీ వచ్చాయి. ఇచ్చినవారికే మళ్లీ ఇవ్వడమేనా ఇందిరమ్మ పాలన అంటే. మేం రేషన్ కార్డుకు అర్హులం కాదా.. మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ఎంత కాలానికి వస్తది. తిండి గింజలు లేక తిప్పలు పడుతున్నా.

– బీనీబాయి, పోచమ్మతండా, కొడంగల్ మండలం

ఇల్లొస్తదని ఉన్న ఇంటిని కూల్చుకున్నా..

ఖాళీ జాగ ఉన్నోళ్లకే ఇల్లొస్తదని చెప్పిండ్రు. ఉన్న ఇల్లును కూల్చుకుని ఇందిరమ్మ ఇల్లుకు దరఖాస్తు చేసుకున్నా. ఇప్పుడు జాబితాలో పేరు లేదు. చాలామందికి ఇల్లు ఉన్నోళ్లకే ఇండ్లు మంజూరైనవి. ఇదెక్కడి ఇందిరమ్మ రాజ్యమో కాంగ్రెసోళ్లే చెప్పాలి. ఇంతటి దుర్మార్గపు కుట్రలను నేనెప్పుడూ చూడలే. అధికారులను అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోమంటున్నరు.

– పాండునాయక్, పోచమ్మతండా, కొడంగల్ మండలం

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితా తప్పులతడకగా ఉన్నదని ఎమ్మెల్యే, అధికారులను నిలదీస్తున్న చర్లపటేల్‌గూడ గ్రామస్తులు

అర్హుల పేర్లు కాకుండా అనర్హుల పేర్లే లబ్ధిదారుల ఎంపిక జాబితాలో వచ్చాయంటూ అధికారులను నిలదీస్తున్న మంచాల మండలం లింగంపల్లి గ్రామస్తులు

నిలదీస్తూ.. నిరసిస్తూ..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంగళవారం జరిగిన గ్రామ సభలు రసాభాసగా సాగాయి. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక జాబితాలు తప్పుల తడకగా ఉండడంతో నిరసనలు, నిలదీతలతో పల్లెలన్నీ రణరంగంగా మారాయి. లబ్ధిదారుల జాబితాలను అధికారులు చదివి వినిపిస్తుండగా అధిక శాతం మంది పేర్లు లేకపోవడంతో సభల్లో గందరగోళం నెలకొన్నది. ఆగ్రహిస్తున్నవారిని బుజ్జగించేందుకు మరోమారు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు, కాంగ్రెస్ నాయకులు సూచించారు. ఇప్పటికే సమగ్ర కుటుంబ సర్వే, ప్రజాపాలన, మీ సేవల్లో దరఖాస్తులు చేసుకున్నామని, మళ్లీ దరఖాస్తులు ఏమిటని నిలదీశారు. ఆయా నియోజకవర్గాల్లో జరిగిన గ్రామ సభల్లో కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనగా, అర్హులమై ఉండి కూడా లబ్ధిదారుల జాబితాలో పేర్లు రాలేదని తీవ్రస్థాయిలో జనం తిరుగబడ్డారు. ఈ క్రమంలో మళ్లీ దరఖాస్తులు చేసుకుంటే పరిశీలిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సర్దిచెప్పడం కనిపించింది.

- రంగారెడ్డి, జనవరి 21 (నమస్తే తెలంగాణ)

గ్రామసభల్లో వెల్లువెత్తిన ఆగ్రహజ్వాలలు

లబ్ధిదారుల జాబితాల్లో పేర్లు లేకపోవటంతో ఆద్యంతం అసంతృప్తుల మధ్య గ్రామ సభలు సాగాయి. అధికారులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీశారు. రంగారెడ్డి జిల్లాలోని మంచాల మండలం లింగంపల్లి గ్రామంలో అర్హుల పేర్లు సైతం జాబితాలో లేవంటూ సీపీఎం నాయకులు నిలదీశారు. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకుని గ్రామసభను పక్కదారి పట్టించొద్దని సూచించి ప్రశ్నించే వారిని అక్కడి నుంచి పంపించేశారు. మాడ్గుల మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో కూడా అర్హుల జాబితాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మొయినాబాద్ మండలంలోని జన్వాడ గ్రామంలో జరిగిన గ్రామసభలో స్థానిక ఎస్సై ఓవర్‌ఆక్షన్ చేశారు. గ్రామసభలో ప్రశ్నిస్తున్న ఓ యువకుడిని లోపలేయండంటూ హుకూం జారీ చేశారు. అక్కడే ఉండి వీడియో తీస్తున్న ఓ విలేకరి ఫోన్‌ను సైతం గుంజుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని పోచమ్మతండా, చిన్ననందిగామ, హుస్సేన్‌పూర్, సంగాయిపల్లి, పలుగురాళ్లతండా, బోయపల్లితండా, అన్నారం, అప్పాయిపల్లి అదేవిధంగా బొంరాస్‌పేట మండల పరిధిలో సాలింగాపూర్, మదన్‌పల్లితండా, చౌదర్‌పల్లి, దుద్యాల మండలంలో ఈర్లపల్లి, లగచెర్ల, అల్లిఖాన్‌పల్లి, సాగారంతండా, ఎక్కచెరువుతండాల్లో జరిగిన గ్రామ సభల్లో గందరగోళం నెలకొన్నది. ఏ పల్లెలో చూసినా సభ సాగినంత సేపు తప్పుల తడకగా ఉన్న జాబితాపై నిలదీయడం కనిపించింది. పెద్దేముల్ మండల పరిధిలోని గాజీపూర్, పెద్దేముల్, గోపాల్ పూర్, నాగులపల్లి గ్రామాలలో జరిగిన గ్రామ సభల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొనగా, తప్పుల తడకగా ఉన్న లబ్ధిదారుల జాబితాను అధికారులు చదివి వినిపిస్తుండగా పెద్ద ఎత్తున జనం తిరుగబడడంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శివారుల్లోని పలు మున్సిపాలిటీల్లో నిర్వహించిన గ్రామసభల్లో కూడా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం అధికారులపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల్లో తమ పేర్లు లేవంటూ అధికారుల మీద తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

లబ్ధిదారుల ఎంపికలో అయోమయం

తమ పేర్లు గల్లంతయ్యాయంటూ ప్రజల గగ్గోలు..

ప్రశ్నిస్తే లోపలేస్తామంటూ పోలీసుల బెదిరింపులు..

కొన్నిచోట్ల మొక్కుబడిగా ముగింపు..

చాలాచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీసిన ప్రజలు

అర్హుల జాబితాలో పేర్లు లేవంటూ పలుచోట్ల నిరసనలు

స్పష్టంగా కన్పించిన సమన్వయ లోపం..

గ్రామసభల నిర్వహణలో బయటపడిన వైఫల్యం

పోలీసు బందోబస్తు మధ్య నిర్వహిస్తున్న మంచాల మండలంలోని లింగంపల్లి గ్రామసభ

గ్రామ సభల్లో అధికార పార్టీ నాయకుల హడావుడి..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో అధికారుల కంటే అధికార పార్టీ నాయకుల హడావుడి ఎక్కువగా కనిపించింది. గ్రామసభలు ప్రారంభం కాగానే, అధికారపార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జాబితాలో ఎవరిపేర్లు ఉండాలనేదానిపై తమ అనుకూలస్తుల పేర్లను సూచించారు. తమవారి పేర్లను మాత్రమే రాయాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. పల్లెల్లోని చోటామోటా లీడర్ల హడావుడి చూసి పల్లె జనం బిత్తరపోయారు. ఇదెక్కడి పాలన.. ఇదేం న్యాయం.. అంటూ ఎదురుతిరిగారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి అధికారంలోకి తీసుకొస్తే ఇంత అన్యాయం చేస్తారని అనుకోలే.. అంటూ ప్రజలు ముచ్చటించుకోవడం కనిపించింది.

ప్రజా పాలన కాదు.. పోలీసుల పాలన..

అర్హులకు కాకుండా అనర్హులకు సంక్షేమ పథకాలు ఎలా అందుతాయని అధికారులను ప్రశ్నిస్తే ఎస్ఐ లోపలేస్తానని బెదిరించడం ఎంతవరకు సమంజసం. ఇది ప్రజా పాలన కాదు.. పోలీసుల పాలన. ఉపాధి హామీ పనుల డబ్బులు రాలేదని కార్యదర్శిని అడిగితే మధ్యలో పోలీసులు ఎందుకు కలుగజేసుకుంటున్నారు. ప్రజా సమస్యలు, పథకాల కోసం ఏర్పాటు చేసిన సభ కాదా..? అందులో సందేహాలు ఉంటే అధికారులను అడిగి నివృత్తి చేసుకోవడం తప్పా.

– యంజాల మల్లేశ్, ముడిమ్యాల్ గ్రామం, చేవెళ్ల మండలం

ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా లాభం లేదు..

సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక సరిగా లేదు. కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా ఉండేవారికే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా వంటి పథకాల ఫలాలు అందాయి. ఇంత దారుణాన్ని నేనెప్పుడూ చూడలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నా.. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా కాంగ్రెస్ లీడర్లకు తొత్తులు కాకుంటే అందవని అర్థమైంది. మళ్లీ ఓట్లు అడగడానికి ఏ మొహం పెట్టుకొని వస్తారో చూస్తా. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు.

– మహ్మద్ ముజీబ్, గాజీపూర్ గ్రామం, పెద్దేముల్ మండలం

సమస్యలుంటే అడుగొద్దా..

గ్రామ సభలో ఏమైనా సమస్యలుంటే అధికారులు, ప్రజాప్రతినిధులను అడుగొద్దా.. ? మరి గ్రామ సభ ఎందుకు పెట్టినట్టు. ఉపాధి హామీ పైసలు రాలేదని సెక్రటరీని అడిగితే ఎస్ఐ సంతోశ్ రెడ్డి వచ్చి లోపల వేస్తా అంటూ బెదిరించడం ఏమిటీ ? ఇదేనా ప్రజాపాలన.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం.. గ్రామంలో దాదాపు 250 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే 19 మంది పేర్లే వచ్చాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం పరిస్థితి కూడా ఇట్లనే ఉన్నది. రుణమాఫీ కూడా చాలా మందికి కాలేదు.

–ఎండీ అప్సర్, ముడిమ్యాల్ గ్రామం, చేవెళ్ల మండలం

లబ్ధిదారుల ఎంపిక జాబితాలు తప్పుగా ఉన్నాయని అధికారులను నిలదీస్తున్న అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గండిచెరువు గ్రామస్తులు

రేషన్‌కార్డులు, ఇండ్లు ఉన్నవారికే మళ్లీ ఎందుకొచ్చాయని, అసలు లేనివారి పేర్లు మాత్రం ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నిస్తున్న కొడంగల్ మండలంలోని పోచమ్మతండావాసులు